క్లుప్తంగా

శౌర్య జాగరణ యాత్ర



జూలూరుపాడులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు

జూలూరుపాడు: విశ్వహిందూ పరిషత్ - భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్రలో భాగంగా ఆదివారం స్థానిక శ్రీసాయిబాబా ఆలయం నుంచి జూలూరుపాడు శ్రీసీతారామాలయం వరకు రామభక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు శీలం పుల్లారెడ్డి, చిట్టిశెట్టి లక్ష్మయ్య, జిల్లా సంఘటన కార్యదర్శి రాయల చందర్‌రావు, జిల్లా ధర్మ ప్రచార ప్రముఖులు చలమల వెంకటేశ్వర్లు, వేల్పుల గోపాలకృష్ణ, భూక్యా రమేష్, వందనపు నరసింహారావు, జమలయ్య, శ్రీను, కొండల రావు, రామభక్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు ఉపాధి కల్పించండి



మాట్లాడుతున్న పాయం వెంకన్న

ఇల్లెందు: ట్రాక్టర్ డ్రైవర్లకు ఉపాధి లేక జీవనోపాధి కష్టంగా మారిందని, డ్రైవర్లకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి పాయం వెంకన్న, యాకుబ్‌షావలీ కోరారు. ఆదివారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రైవర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఒకప్పుడు ట్రాక్టర్లకు రాయి, ఇసుక, మట్టి తోలకాలకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం సీనరేజ్ కింద ఆంక్షలు విధిస్తున్నారని, మాఫియాలకు, పెత్తందారులకు వరంగా మారిందన్నారు. డ్రైవర్లకు ఉపాధి కల్పించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఈ సమావేశంలో రాంబాబు, సమ్మయ్య, భాస్కర్, సురేష్, నాగేంద్రబాబు, పాపారావు, కోటి పాల్గొన్నారు.

ప్రజా నేతల అరెస్టులు సరికాదు

పాల్వంచ: ప్రజా నాయకులపై ఉపా కేసులు పెట్టి జైలుకు పంపడం సరికాదని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు అన్నారు. పార్టీ భద్రాచలం డివిజన్ నాయకుడు కొండా చరణ్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. రాంబాబు మాట్లాడుతూ.. అతని వద్ద మావోయిస్టుల వస్తువులు, సాహిత్యం, బ్యానర్లు ఉన్నాయని సృష్టించి ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు పంపించడం బాధాకరమన్నారు. చరణ్‌పై పెట్టిన కేసులు ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుంజా రమేష్, నీలం భాస్కర్, రాయబారపు విశ్వం, కంటే గోవర్ధన్, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి పంట

- ఈ ఏడాది తెల్లబంగారం పైనే రైతుల ఆశలు
- పూత, కాత దశకు చేరిన పంట



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

సుజాతనగర్: రెండేళ్లుగా నష్టాలు చవిచూస్తున్న రైతులు ఈ ఏడాది పత్తి పంటపైనే గంపెడాశలు పెట్టుకున్నారు. మండలంలో ప్రధాన పంటగా ఆవిర్భవించిన పత్తి మరో 15 రోజుల్లో పత్తితీతకు వచ్చే అవకాశముంది. అధికార యంత్రాంగం గిట్టుబాటు ధర అందించే విషయంలో ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగితే తప్ప రైతులకు మేలు చేకూరే అవకాశం లేదు. గత ఏడాది సీసీఐ కేంద్రాలున్నప్పటికీ రైతులు వ్యాపారులను ఆశ్రయించే తక్కువ ధరకు పత్తిని అమ్ముకున్నారు. వ్యాపారులు రైతుల 'అవతారం'లో అమ్ముకొని లాభపడ్డారు. ఫలితంగా రైతులు నష్టాన్ని చవిచూశారు. ఈ సారైనా సరైన 'గిట్టుబాటు'ధర వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలో పత్తిసాగు అధికం....

మండల వ్యాప్తంగా రైతులు ఏటా పత్తి పంటే అధికంగా సాగు చేస్తారు. ఆ తర్వాత వరి, మిర్చీ పంటలు పండిస్తారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో పత్తి పంటకే ప్రాధాన్యం ఇస్తున్నారు రైతులు. ఈ వానాకాలం 10,785 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగుచేశారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాత దశకు చేరుకోవడంతో దిగుబడి అనుకున్న రీతిలో వస్తుందని ఆశిస్తున్నారు. పత్తితీత సమయంలో అకాల వర్షాలు లేకుంటే నాణ్యమైన పంట చేతికొచ్చే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. గతేడాది పత్తి క్వింటాల్ ఒక్కింటికి రూ.10 వేలకు చేరువైన నేపథ్యంలో ప్రస్తుతం తెల్లబంగారం లాభాలు తీసుకొస్తుందనే ఆశతో ఉన్నారు. గతేడాది కంటే 1000 ఎకరాల్లో అదనంగా ఈ ఏడాది రైతులు పత్తిపంటను సాగుచేశారు. ఈ పంట వాణిజ్య పంట కావడం, అధిక దిగుబడులు వస్తుండడంతో పత్తి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పత్తి విత్తనాల ధర అందుబాటులో ఉండటం, మద్దతు ధర అధికంగా లభించడం, వరికి మద్దతు ధర తక్కువగా ఉండటం, పెట్టుబడులు అధికంగా ఉండటంతో రైతులు పత్తి వైపు అధికంగా మొగ్గ చూపుతున్నారు. మొక్కజొన్నకు పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. వాటిని నివారించడం కష్టంతో కూడుకున్న పని. పత్తికి మందులు తక్కువగా కొట్టే విధానం రావడంతో పత్తి సాగుకే సై అంటున్నారు.

ఏపుగా పెరిగిన మొక్కలు...

ప్రస్తుతం పత్తి మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాత దశకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల చీడపీడలు, ఎర్రనల్లి ఉధృతి ఉండటంతో రైతులు క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. పూత, కాత దశలో వర్షాలు అధికంగా పడితే తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. నేలలో తేమ ఉండడంతో ఎరువులు యూరియా, పోటాష్ వేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సైతం తెగుళ్లు, గులాబీ రంగు పురుగు నివారణకు క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా గులాబీ రంగు పురుగు ఉధృతిని ,గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో లింగాకర్షక బుట్టలపై ప్రభుత్వం సబ్సిడీ ఎత్తి వేయడంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

5 ఎకరాల్లో పత్తి సాగు చేసినం



ప్రస్తుత సీజన్‌లో 5 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. ఇప్పటి వరకు పంట సాగుకు సుమారు లక్షన్నర వరకు ఖర్చు అయింది. గత సంవత్సరం ధర అంతగా లేకపోవడంతో నష్టాలు లేకుండా సరిపోయింది. గత సంవత్సరం ఎకరానికి 7 నుంచి 8 కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది.

– గూని శ్రీనివాసరావు, నాయకులగూడెం

రూ.10 వేలు ఉంటే గిట్టుబాటు అవుతుంది



ఎకరంన్నర విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశాను. సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి అయింది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇప్పటి వరకు పంట అయితే బాగానే ఉంది. పత్తి ధర క్వింటా రూ.10 వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుంది. ఖర్చులు పోనూ కొద్దిగా మిగులుతాయి.

– మండే శ్రీను, నాయకులగూడెం

లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలి



పూత, కాత దశలో పత్తి పంటను గులాబీ రంగు పురుగు దాడి చేసే ప్రమాదం ఉంది. పూత నుంచి కాయలోకి ప్రవేశించి కాయను తొలచివేస్తుంది. గులాబీ రంగు పురుగు నివారణకు పత్తి చేలల్లో రైతులు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

– గాంధ్ల నర్మద, మండల వ్యవసాయాధికారిణి

ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభం

ఇల్లెందు: సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆదివారం 24 ఏరియాలోని సింగరేణి సేవాసమితి కార్యాలయంలో వివిధ రంగాలలో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న 125 మందికి శిక్షణ తరగతులను జీఎం జాన్‌ఆనంద్, సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ చేతుల మీదుగా ప్రారంభించారు. జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు సింగరేణి సేవా సమితి చేపడుతున్న ఉపాధి అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం కోర్సులలో 125 మంది ప్రత్యేక శిక్షణ పొందుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సేవా కార్యదర్శి విజయ, సులక్షణ, ట్రైనర్స్, సేవా సమితీ సభ్యులు పాల్గొన్నారు.

బాబాసాహెబ్ స్ఫూర్తిని కొనసాగించాలి



డాక్టరేట్స్‌ను సన్మానిస్తున్న స్థానికులు

కొత్తగూడెంఅర్బన్: ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, అనేక డిగ్రీలు సాధించి, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బస్టాండ్ సమీపంలోని ప్రకృతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన 'డాక్టరేట్స్' అభినందన సభలో పలువురు పాల్గొని మాట్లాడారు. పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పగిడి కత్తుల విజయ్‌కుమార్, కొత్తగూడెం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ విధులు నిర్వర్తిస్తున్న ఎ.వెంకట్‌లను ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో మొక్కల వెంకటయ్య, సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, విశ్రాంత అధ్యాపకులు రాజీర్, జేబీ శౌరి, మహమ్మద్ ముస్తఫా, ఎస్‌కే నబీసాహెబ్, సింగర్ వెంకటముత్యం, బిక్కులాల్, బాలు, పిచ్చయ్య, పరశురాములు, సాగర్, ఆశ్రమ కోఆర్డినేటర్ సుగుణరావు, విశ్రాంత ప్రిన్సిపాల్, సామాజికవేత్త డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



నినాదాలు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

చుంచుపల్లి: తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సమ్మెకు దిగిన ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు హెచ్చరించారు. రెండో రోజు ఆదివారం ఈ-పంచాయతీ ఆపరేటర్లు తమ నిరసనలు కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఆదిలోనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విక్రమ్, కిషోర్, అనీషా, చంద్రకళ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రహదారి మంజూరు

పాల్వంచరూరల్: సంగం గ్రామపంచాయతీని ఆదివారం డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సందర్శించారు. మాట్లాడుతూ.. నేటివరకు రహదారి సౌకర్యం లేని సంగం గ్రామానికి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రహదారి నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేశారని తెలిపారు. రోడ్డు పనులకు 4వ తేదీన ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దమ్మగుడి డైరెక్టర్ ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, లక్ష్మీనారాయణ, పోలెబోయిన వీర్రారాజు, సర్పంచ్ మగ్బుల్, సొసైటీ డైరెక్టర్ సీహెచ్.పాపారావు, రామారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు న్యాయం



ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయని గుర్తుచేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెవాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించాలని చెప్పారు. ఇటీవల పార్టీ అధినేత సోనియాగాంధీ ఆరు హామీలను ప్రకటించారని గుర్తుచేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ప్రతినెల రూ.2,500, గ్యాస్ సిలిండర్ రూ.500, ఆరోగ్య బీమా తదితర పథకాలను ప్రజలకు పరిచయం చేశారు. అంతేకాకుండా దళితబంధు రూ.12 లక్షలు, ఇంంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు కాంగ్రెస్ అధినాయకత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో అన్ని వర్గాల ప్రజలకు ఆశలు కల్పిస్తూ మోసం చేస్తోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి సంక్షేమ ఫలాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల రాము, మహేష్, పూనెం సురేందర్, పాయం స్వాతి, కల్తి పద్మ, శారద, నిర్మల, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, శ్రీనివాస్, ధనుంజయ్, ముక్తి కృష్ణ, తాటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన బీఆర్ఎస్ నాయకులు



ఉల్వనూరులో ప్రచారం చేస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుపేద ప్రజల జీవితాలు బాగుపడుతాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. ఉల్వనూరు గ్రామంలో ఆదివారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తొమ్మిది సంవత్సరాల తర్వాత కానీ కేసీఆర్, కేటీఆర్‌కు భద్రాచలం గుర్తుకు రాలేదని విమర్శించారు. తండ్రీకొడుకులు ఇచ్చిన హామీలను విస్మరించారని, ఈసారి ప్రజలు మోసపోవద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం మాటల గారడీ చేస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కట్టా సోమయ్య, చారి, బర్ల లక్ష్మణ్‌రావు, వెంకన్న, సాంబయ్య, ఇసోబు, అమృతరావు, బాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ కమిటీ ఎన్నిక

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ కమిటీని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడిగా మైముద్‌ఖాన్, పట్టణ మైనార్టీ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అక్బర్, చుంచుపల్లి మండల మైనార్టీ అధ్యక్షుడిగా మహ్మద్ పక్రుద్దీన్, టౌన్ మైనార్టీ సెక్రెటరీగా ఫైజుద్దీన్, పట్టణ మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఖాదర్‌ను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు.

సింగరేణిలో స్వచ్ఛత ఏదీ?



సింగరేణి ప్రధాన కార్యాలయ ఆవరణలో చెత్త

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛత సేవా కార్యక్రమాలప్పుడే కార్యాలయాలు క్లీన్ చేస్తారా..? అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సింగరేణి సంస్థ ప్రతి ఏడాది క్లీన్ అండ్ గ్రీన్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ప్రతి ఏడాది నిర్వహించి, వివిధ ఏరియాలలో బెస్ట్ ఏరియాలను సెలెక్ట్ చేసి బహుమతులను ప్రతి ఏడాది జరిగే వేడుకల్లో ఆయా శాఖలు, ఉద్యోగులకు అందజేస్తారు. ఆ రోజుల్లో పరిశుభ్రం చేశారని కార్పొరేట్ ఏరియాకు కూడా బహుమతులు అందజేశారు. తాజాగా కార్పొరేట్ కార్యాలయంలోని చెత్త చెదారాన్ని క్లీన్ చేసే కార్యక్రమం గత నెల 28న చేపట్టారు. ఇంత చెత్త కార్యాలయంలో ఉంచుకొని బహుమతులు ఎలా ఇచ్చారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా నిత్యం కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు కార్యాలయంలో ఇంత చెత్త చెదారం పెట్టుకొని ఎలా విధులు నిర్వహిస్తున్నారని కార్మికవర్గం నిలదీస్తోంది. పరిశుభ్రం పక్కన పెడితే ఈ చెత్తచెదారం కార్యాలయంలో ఉంటే వీటి నుంచి వచ్చే దుమ్ము, ధూళి వలన సీజనల్‌లో వ్యాధుల కంటే వీటి నుంచి వచ్చే వ్యాధుల వలన జీవితాంతం ఇబ్బంది పడాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. అధికారులు పనిచేసే కార్యాలయంలో ఇంత చెత్తా ఎలా పేరుకు పోయిందో అర్థం కావటం లేదని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఏదాదికో రోజు కాకుండా ప్రతివారంలో ఒకరోజు రెండు గంటలు కేటాయిస్తే కార్యాలయంతోపాటు అందులో పనిచేసే ఉద్యోగులు కూడా ఆరోగ్యంగా ఉంటారని కార్మికులు భావిస్తున్నారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించండి



ఇల్లెందు: వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు



జూలూరుపాడులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

ఇల్లెందు: ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించి, సమ్మెను విరమింపజేయాలని సీపీఎం అనుబంధ సీఐటీయూ డిమాండ్ చేసింది. ఆదివారం ఆశా వర్కర్లు ప్రభుత్వ వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ శిరీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఏ నబీ, చీమల రమణ, మల్లీశ్వరీ, చంద్రకళ, విజయ, విమల, ఈశ్వరీ, లక్ష్మి, లత, మోహన్‌రావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం జూలూరుపాడులో ఆశా వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పూనెం ఝాన్సీ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. నీలిమ, వసుంధర, లక్ష్మి, దేవి, బూలీ, జయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ 'స్వచ్ఛతా హీ సేవా'

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు జాతీయ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ప్రభుత్వ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీలు, కిన్నెరసాని అభయారణ్య పార్క్, బోటింగ్ ప్రదేశం, కిన్నెరసాని ప్రాజెక్టు డ్యామ్ పరిసరాల్లో స్థానికులతో కలిసి అధికారులు, ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు, విద్యార్థులు శ్రమదానం చేసి చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ ఘనంగా నిర్వహించి, మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: చెత్త తొలగిస్తున్న విద్యార్థులు



పాల్వంచరూరల్: మందేరకలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుభ్రం చేస్తున్న సీడీపీఓ కనకదుర్గ



ఇల్లెందురూరల్: గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత



చుంచుపల్లి: రోడ్లను ఊడ్చి, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న బీజేపీ నాయకులు



సుజాతనగర్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



జూలూరుపాడు: రోడ్డును శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు



కొత్తగూడెంరూరల్: శ్రీరామచంద్ర కళాశాలలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న బ్యాంకుల సిబ్బంది



పాల్వంచరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శంకర్



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో శ్రమదానం చేస్తున్న అధికారులు, ప్రజలు

పలు డిమాండ్లతో అంగన్‌వాడీల నిరసన



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



సుజాతనగర్: పొర్లు దండాలతో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు



టేకులపల్లి: సమ్మె శిబిరంలో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

ఇల్లెందు: అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులో దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా పలు రకాల వర్కర్లు ఆందోళనలు చేస్తుంటే పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమ్మెలో సీఐటీయూ నాయకులు నబీ, వెంకటమ్మ, మమత, మరియ, ఫాతిమా, నాగలక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో 21 రోజులుగా టేకులపల్లి తహసీల్ ఎదుట అంగన్‌వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ నిరవధిక సమ్మె కొనసాగుతోంది. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్గా పర్మనెంట్ చేయాలని, సెంటర్లలో హెల్పర్లను నియమించాలని, అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని హెల్పర్లకు రూ.ఐదు లక్షల ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిరసన తెలియజేశారు.

కార్యక్రమంలో వై.ఇందిర, కొండపల్లి శకుంతల, అయిత శ్రీరాములు, సోని, వై.పద్మావతి, వి.సంధ్యారాణి, ఎన్.విజయలక్ష్మి, ఎం.నాగమణి, టి.వరమ్మ, వి.రాజేశ్వరి, కల్తీ భద్రమ్మ, కే.రాజేశ్వరి, ఐ.రాధ పాల్గొన్నారు.

పొర్లు దండాలతో...

సుజాతనగర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత నెల 11 నుంచి అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విధితమే. 21 రోజులుగా సమ్మె చేస్తున్నా పరిష్కారం లభించకపోవడంతో ఆదివారం వారు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. స్థానిక శివాలయంలో పొర్లు దండాలు పెడుతూ సీఎం కేసీఆర్ తమ సమస్యకు పరిష్కారం చూపాలని శివయ్యను వేడుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు కళావతి, వీరమ్మ, పద్మ, పద్మావతి, శశికళ, జ్యోతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ తహసీల్ అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె, నిరసన దీక్ష శిబిరాన్ని ఆదివారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ నబీ, కారం పద్మ, సుల్తానా, స్వాతి, పద్మ, మండల రాముమహేష్, సాంబమూర్తి, పూనెం సురేందర్, బోళ్ల సూర్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.